క్లుప్తంగా

సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం



జయప్రకాష్‌నగర్‌లో సాగుతున్న రహదారి నిర్మాణ పనులు

కాకినాడ రూరల్: స్మార్ట్‌సిటీ నగర్ కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని జయప్రకాష్‌నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. జయప్రకాష్ నగర్‌లో మూడు వీధుల్లో సుమారు రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి గతంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శంకుస్థాపన చేశారు. పనులను ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టడంతో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వడ్డి మణికుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దైవకృప, బాలే భువనేశ్వరి, టేకుమూడి దుర్గ, సిరిగినీడి దుర్గారావు, భీమరాజు, గుత్తుల ప్రసాద్, యల్ల శ్రీనివాసరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం అత్యంత బాధాకరం



వైడీ రామారావు

కాకినాడ: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం భారతీయ రైల్వే చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన, విషాదకరమైనదని జిల్లా ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు వైడీ రామారావు పేర్కొన్నారు. ఘటనపై శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రయాణికులు మృత్యువాతపడడం ఆవేదన కలిగించిందన్నారు. ఆధునికతను వినియోగిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం రైల్వేశాఖకు ఎంతో ఉందన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు శుభ్రం చేయండి

కాకినాడ సిటీ: స్థానిక శశికాంత్‌నగర్ ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటి సమస్యపై సత్వరం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శశికాంత్ వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న తాగునీరు నాచు, దుర్వాసనతో కూడిన మురుగునీరు సరఫరా అవుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పూడిక తీత పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు శనివారం ప్రతాప్‌నగర్ ప్రాంతంలో పూడిక తీత పనులను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వర్షాలు పడేలోపు పూడికతీత పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగానికి చెందిన సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా బలోపేతానికి చర్యలు

బోట్‌క్లబ్: ఎస్సీ మోర్చా బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండ్రు సతీష్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ మోర్చా బలోపేతంలో భాగంగా కార్యవర్గ సభ్యులుగా మోతుకూరి లక్ష్మి, ఎద్దు అనురాధను నియమించినట్లు చెప్పారు. మహిళలకు బీజేపీ నాయకత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పార్టీకి సేవ చేసిన వారిని ఎప్పుడూ గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు రాచర్ల చిన్ని, ఎస్.మూర్తి పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



నృత్యం చేస్తున్న మానస

కాకినాడ కల్చరల్: కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పద్మశ్రీ పురస్కార గ్రహీత, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో కుమారి కొల్ల మానస భరతనాట్య అరంగ్రేటం శనివారం సాయంత్రం జరిగింది. వీఎస్ఎం అటానమస్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ధనశ్రీ, శ్రీనివాసరావు, ద్విభాష్యం నగేష్ బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం: ఈ నెల ఒకటో తేదీన సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కోమటి అప్పలస్వామి (48) మృతదేహం శనివారం లభ్యమైంది. ఈ ఘటనపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయమే పండగలా



కరపలో రాయితీపై యంత్ర పరికరాలను అధికారులతో కలసి అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు (ఫైల్)

కరప మండలంలో వివిధ పథకాల ద్వారా రైతులు పొందిన లబ్ధి			
పథకం	సంవత్సరం	రైతుల సంఖ్య	పొందిన లబ్ధి (రూ.లలో)
రైతుభరోసా	2020	12,702	11,78,68,000
	2021	10,446	11,18,16,500
	2022	10,592	10,32,88,950
	2023	8,792	4,83,56,000
ఇన్‌పుట్ సబ్సిడీ	2019	1,561	70,51,146
	2020	9,135	4,03,89,536
	2021	10,443	5,47,89,671
పంటల బీమా	2020	7,715	15,14,89,874
	2021	9,642	11,64,53,030

19 రైతు గ్రూపులకు రూ.87,080 లక్షల రాయితీతో యంత్ర పరికరాలు ప్రభుత్వం అందజేసింది

- రైతు పక్షపాతిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- అన్నదాతల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- దుక్కి మొదలు కోతల వరకు అడుగడుగునా జగనన్న సాయం

కరప: అప్పుల బాధలు.. కన్నీళ్లు తప్ప కనీస మద్దతు ధర లభించని పరిస్థితి నాటి అన్నదాతది. వ్యవసాయం దండగ అన్నారు. నకిలీ విత్తనాలు ఒకవైపు.. మద్దతు ధర ఇవ్వకపోవడం మరోవైపు. ఏదైనా లబ్ధి చేకూరిందంటే టీడీపీ వర్గీయులకో లేదా వారి అనుయాయులకో దక్కేది. ఇదంతా గతం. నేటి పరిస్థితి అందుకు విభిన్నం. తింటే గారెలే తినాలి.. చేస్తే వ్యవసాయమే చేయాలనేలా కోతల వరకు అడుగడుగునా పెట్టుబడి సాయం నుంచి గిట్టుబాటు ధర చెల్లించే వరకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తోంది నేటి ప్రభుత్వం. ప్రకృతి కన్నెరజేసినా అదే సీజన్‌లో పరిహారం అందిస్తూ రైతుల్లో దరహాసం నింపుతోంది జగనన్న ప్రభుత్వం. రైతు భరోసా, ఉచిత పంటల బీమా తదితర పథకాలతో సీఎం జగన్ అన్నదాతకు అండగా నిలబడుతున్నారు. నాటి ప్రభుత్వంలో కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం. జగనన్న ప్రభుత్వంలో అసలు రైతుతో సమానంగా లబ్ధి అందుతోంది. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ, గుర్తింపుకార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకూ పరిహారం, బీమా సొమ్ము అందుతున్నాయి. ఆర్బీకే వ్యవస్థ ద్వారా పూర్తి వ్యవసాయ సమాచారంతో పాటు, యంత్ర సాయం, సాగు సలహాలు, పథకాల లబ్ధిని ఎప్పటికప్పుడు అందజేస్తూ రైతు పక్షపాతి ప్రభుత్వమనే పేరును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సార్థకం చేసుకుంది.

సీఎం జగన్ మేలు మరువలేం



సీఎం జగన్ రైతులకు చేస్తున్న మేలు ఎన్నటికీ మరువలేం. గతంలో వర్షాలకు పొలాలు మునిగిపోతే నష్టపరిహారం ఎప్పుడు వస్తుందో తెలిసేదికాదు. సీఎం జగన్ వచ్చాక తుపాన్లు వచ్చినా ఆదుకుంటారనే నమ్మకం ఏర్పడింది. నాకు 7.5 ఎకరాలు పంటభూమి ఉంది. 2021 తొలకరిలో అధిక వర్షాలకు ఐదు ఎకరాల్లో పంట నష్టపోతే పరిహారంగా రూ.30 వేలు అకౌంట్‌లో జమ చేశారు.

– పెనుమర్తి నాగేశ్వరరావు, రైతు, అరట్లకట్ట

రైతు భరోసాతో ధీమా



ఏటా రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయంగా రూ.13,500 అందుతోంది. సీజన్ ప్రారంభంలోనే రూ.7,500, తర్వాత మరో రెండు విడతల్లో పూర్తి సొమ్ము ఇస్తున్నారు. ఈ పథకంతో పెట్టుబడికి భరోసా కలుగుతోంది. అధిక వర్షాలకు పంట దెబ్బతింటే బీమా ఇచ్చి ఆదుకుంటున్నారు.

– రెడ్డి శ్రీనివాస్, కౌలురైతు, యండమూరు

కౌలు రైతులకూ ఎంతో మేలు



గతంలో ఏ ప్రభుత్వమూ కౌలురైతులను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక రైతులతో పాటు కౌలు రైతులకూ పంట నష్టపరిహారం, బీమా వర్తింపచేసి ఎంతో ఉపకారం చేస్తున్నారు. నేను రెండు ఎకరాలు కౌలుకుతీసుకుని సాగుచేయగా నిరుడు కురిసిన అధిక వర్షాలకు 1.67 ఎకరాల్లో పంట దెబ్బతింది. అధికారులు పరిశీలించి పెట్టుబడి సాయం చేసి ఆదుకున్నారు.

– మాదవరపు వెంకటేశ్వరరావు, కౌలురైతు, కరప

ఎమ్మెల్యే కన్నబాబుకు గీసాల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తున్న శ్రీను

కాకినాడ రూరల్: వరసగా రెండోసారి కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఇంద్రపాలెం గ్రామ నాయకుడు గీసాల శ్రీను కృతజ్ఞతలు తెలియజేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఇంద్రపాలెం గ్రామ నాయకులతో కలసి వచ్చి కన్నబాబుకు పుష్ప గుచ్ఛం ఇచ్చి ఏఎంసీ చైర్మన్‌గా రైతులకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



సావిత్రికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పద్మ

కరప: కరప గ్రామానికి చెందిన పుణ్యమంతుల సావిత్రి కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని, చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ గండి పద్మ అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు.



రామాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

రామాలయం ప్రారంభం

కాకినాడ: స్థానిక జగన్నాథపురం తూరంగిపేటలో పునర్నిర్మించిన రామాలయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.8లక్షల వ్యయంతో అక్కడి భక్తులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ధోని చిట్టిబాబు, పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ



కరపలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం' ద్వారా సమగ్ర రీసర్వే చేయించి, హక్కు పత్రాలు ఇస్తున్నట్టు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం రైతులకు భూహక్కు పుస్తకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రీసర్వే పేరుతో కొంతమంది వీఆర్వోలు రైతులను వేధిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతో కోట్ల రూపాయలు వ్యయం చేసి, సర్వే చేయించి, సరిహద్దులు నిర్ణయించి, మక్కురాళ్లు పాతించడం జరుగుతోందన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా సర్వేచేసి, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో భూ యజమానులకు నచ్చచెప్పాలని ఎమ్మెల్యే సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 రెవెన్యూ గ్రామాల్లో ఇంత వరకూ 15 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 11,572 మందికి శాశ్వత భూ హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా ఎమ్మెల్యే కన్నబాబుతో లాంఛనంగా పంపిణీని ప్రారంభించామన్నారు. తర్వాత స్థానిక నాయకులతో కలసి అందరికీ హక్కుపత్రాలు ఇస్తామన్నారు. ముందుగా రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు బొందా చంటిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఐడీఏ సభ్యులు



విద్యార్థులతో అడబాల రత్నప్రసాద్ తదితరులు

బోట్‌క్లబ్: నిత్యం ఐదు నుంచి ఆరు కిలోమీటర్లు సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్ అన్నారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, వైద్యులు సువర్ణ, సిరాజ్, రఘురామ్, పద్మావతి పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, రాఘవరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాచ్ ఫ్లవర్ మెడిసిన్‌తో మానసిక రుగ్మతలు దూరం



మానసిక వైద్య నిపుణురాలు లక్ష్మీప్రకాష్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: మానసిక రుగ్మతలను నయం చేసేందుకు బ్యాచ్ ఫ్లవర్ మెడిసిన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు అడపా లక్ష్మీప్రకాష్ అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభిశారద అధ్యక్షతన శనివారం ఫెలోషిప్ మంత్ ప్రారంభమైంది. ప్రకృతి నుంచి సేకరించిన వివిధ మొక్కల నుంచి తయారు చేసిన ఫ్లవర్ మెడిసిన్ ద్వారా ఇప్పటి వరకూ 50 మంది రోగులకు వైద్యం చేసి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. రోటరీక్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. అనంతరం లక్ష్మీప్రకాష్‌ను క్లబ్ మాజీ గవర్నర్ ఎల్.సత్యనారాయణన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గమిని కాశీ, క్లబ్ కార్యదర్శి కోనాడ ప్రకాశరావు, క్లబ్ సభ్యులు సీతాపతిరావు, రిక్కీ గూటం, పెంకె శ్రీనివాసబాబా పాల్గొన్నారు.

రైళ్ల ఢీ ఘటనపై హెల్ప్‌లైన్ ఏర్పాటు



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్

సామర్లకోట: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై ప్రయాణికుల సమాచారం తెలుసుకునేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై స్టేషన్ మాస్టర్ రూమ్ వద్ద ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ను పెట్టారు. ఈ ప్రమాదంపై సాయంత్రం వరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు.

నేడు బాలు జయంతి వేడుకలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్ సెంటర్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపకుడు డి.రామ్‌రాజ్ ఆధ్వర్యంలో అమర గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతిని ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సంగీత అభిమానులు, కళాభిమానుల అందరూ హాజరు కావాలనీ కోరారు.

శృంగార వల్లభా.. గోవిందా..

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.3.39 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా మరిడమ్మ ఉయ్యాల తాళ్ల ఉత్సవం

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా నిర్వహించే ఉయ్యాల తాళ్ల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం పాత పెద్దాపురం నుంచి తాటిచెట్లకు తాళ్లు కట్టి పట్టణంలో ఊరేగించారు. భారీ జనంతో గరగల నృత్యం, డప్పులతో వార్డుల్లో తిరుగుతూ వాటిని అమ్మవారి గుడికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ వెలుగుల సురేష్ పర్యవేక్షణలో బందోబస్తు కల్పించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

పౌర్ణమి సందర్భంగా శనివారం మరిడమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల మధ్య వైభవంగా హోమాన్ని నిరహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మన భూమిని రక్షించుకుందాం

- గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించండి
- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్

కాకినాడ సిటీ: గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాకినాడ కేంద్ర గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించారు. 46 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనకున్నది ఒకే ఒక భూ గ్రహమని, దానిని రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. సర్వశిక్ష అభియాన్ ఐఈ సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ స్పృహ కలిగి ఉండాలన్నారు. రోటరీ క్లబ్ బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ చైర్మన్ పీవీ సుబ్బారావు, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కె వెంకటరావు, గ్రంథాలయ పాలకుడు డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు సత్వరం పూర్తిచేయండి



కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: అసంపూర్తిగా వదిలేసిన ప్రభుత్వ భవన నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, ఆర్బీకే భవనాలు, వెల్నెస్ సెంటర్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆ వివరాలు తెలియజేయాలన్నారు. 2019లో నిర్మాణాలు ప్రారంభించామని, నేడు మెటీరియల్ ధరలు పెరగడంతో ప్రస్తుత రేట్ల ప్రకారం అంచనాలు తయారుచేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. గతంలో మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను పరిశీలించి బిల్లు చేసేవారని, ప్రస్తుతం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్‌లు తయారు చేసి బిల్లులు చేయడంలో జాప్యం చేయడం వల్ల పనుల్లో జాప్యం జరుగుతోందని ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి కె.మణిమాల, పరిపాలనాధికారి వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం

- ఆర్డీఓ జేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టారీత్యా నేరమని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని ఆర్డీఓ జె.సీతారామారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.సరిత అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శనివారం ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి అధ్యక్షతన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓలు మాట్లాడుతూ బాలికలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొత్తగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలని, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం కిషోర బాలికలకు గర్భ నిర్ధారణపై అవగాహన కల్పించారు. న్యాయ సలహాదారు రవికుమార్, కందుల వెంకటాచలం, వైద్యులు సాయి కిరణ్, సుప్రియ, హెచ్‌వీ వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.